క్లుప్తంగా

మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా వరలక్ష్మి



నూతనంగా ఎన్నికైన మహిళా సమాఖ్య సభ్యులు

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలంలోని కన్‌సాన్‌పల్లిలో శుక్రవారం గ్రామ మహిళా సమాఖ్య ఎన్నికలు నిర్వహించారు. ఐకేపీ సీసీ వీర్‌కుమార్ వీఓఏలు ఆర్.ఆంజనేయులు, కాడెం రేణుకల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించి 5 మందితో కూడిన గ్రామ సమాఖ్య కమిటీలను ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా తలారి వరలక్ష్మి, విజయ, కార్యదర్శులుగా సుజాత, లలిత, కోశాధికారులుగా మాణెమ్మ, సుజాతలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులందరిని శాలువా, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. పాత కమిటీ సభ్యులకు వీడ్కోలు పలికారు.

రోడ్లపై వడ్లు ఆరబోత



రేడియల్ రోడ్డుపై ఆరపోసిన వడ్లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీలోని కొల్లూర్‌రింగ్ రోడ్డు నుంచి తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే రేడియల్ రోడ్డుపై శుక్రవారం రైతులు ధాన్యాన్ని ఆరపోశారు. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. రైతులకు వడ్లను ఎండబెట్టుకోవడానికి సరైన వసతులు లేకపోవడంతో రోడ్లపైనే ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రమాదాలు జరగకముందే అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ



ధాన్యాన్ని పరిశీలిస్తున్న నూతన్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఏడీఏ నూతన్‌కుమార్ తనిఖీ చేశారు. ధాన్యం విక్రయించేందుకు రైతులు నిబంధనలు పాటించాలని సూచించారు. రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశం, ఏఈఓ కృష్ణవేణి పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

వట్‌పల్లి(అందోల్): మండలంలోని నాగులపల్లిలో నల్లపోచమ్మ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం బోనాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం గ్రామస్తులు బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా డప్పు చప్పుళ్ల, శివసత్తుల పూనకాల మధ్య సాగింది. నైవేద్యాన్ని సమర్పించి అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారికి మంగళ స్నానాలు చేశారు. బోనాల ఉత్సవాల్లో గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా మలేరియా దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కల్హేర్(నారాయణఖేడ్): ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కల్హేర్‌లో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ జెబ సుల్తానా మాట్లాడుతు మలేరియా నియంత్రణ చర్యల గురించి వివరించారు. దోమల వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మానిక్యాం, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు

మునిపల్లి(అందోల్): ప్రజలకు తాగునీటి కోసం మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో బోరు వేస్తున్నట్లు రాయికోడ్ మార్కెట్ కమిటీ సభ్యులు మైపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని తాటిపల్లి బీసీ కమ్యూనిటీ హాలు, వాటర్ ట్యాంక్ సమీపంలో బోరు వేశారు. తాగు నీటి కొరత ఎక్కడ ఉందో అక్కడ బోరు వేయాలని మంత్రి దామోదర చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మధుకర్, నాయకులు సంగమేశ్వర్, సురేష్, నరేశ్ ఉన్నారు.

ఏడాదిలో నలుగురు ఎస్‌ఐలు

- సిబ్బంది కొరత.. పని ఒత్తిడే కారణమా?
- వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు పట్టుకున్న ఎస్‌ఐల గ్రహణం
- రెండు మూడు నెలల కంటే ఎక్కువ పనిచేయని వైనం



వట్‌పల్లి పోలీస్ స్టేషన్

వట్‌పల్లి(అందోల్): జిల్లాలోని వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌ఐల గ్రహణం పట్టుకుంది. దీంతో ఈ ఏడాదిలోపే ఏకంగా ముగ్గురు ఎస్‌ఐలు వివిధ కారణాలతో బదిలీలయ్యారు. ఎస్‌ఐగా బాధ్యతలను చేపట్టినప్పటినుంచి రెండు, మూడు నెలలు కంటే ఎక్కువ పనిచేయకుండానే బదిలీపై వెళ్లిపోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. సంగమేశ్వర్ ఎస్‌ఐ మే 15 , 2024లో విధుల్లో చేరి కేవలం రెండు నెలల్లోనే వేరొక చోటికి బదిలీ చేయించుకున్నారు. ఆ తర్వాత ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మణ్ స్థానిక కాంగ్రెస్ నాయకుడి జన్మదినం రోజున కేక్‌ను స్టేషన్‌లో కట్ చేయడం వివాదం కావడంతో రెండు నెలల్లోనే బదిలీ వేటు పడింది. ఎస్‌ఐ విఠల్ సెప్టెంబర్ 2, 2024లో విధుల్లో చేరి సిబ్బంది కొరత కారణంగా పని ఒత్తిడి పెరగడంతో ఇటీవల అక్కడి నుంచి బదిలీ చేయించుకున్నారు. దీంతో ఇటీవల శ్రీకాంత్ వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు కంది సీసీఎస్ నుంచి బదిలీపై వచ్చారు. ఈయన ఎన్ని రోజులు ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తారోనని అప్పుడే స్థానికంగా చర్చలు మొదలయ్యాయి.

పని ఒత్తిడే కారణమా...

వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐలు ఎక్కువ కాలం పనిచేయకపోవడానికి కారణం పని ఒత్తిడేనని తెలుస్తుంది. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల బార్డర్ కావడం, అక్రమ రవాణాకు అనుకూలమైన రహదారి కావడం, దీన్ని అరికట్టేందుకు సరైన సిబ్బంది లేకపోవడం వల్ల ఎస్‌ఐలు చాలా ఒత్తిడికి గురవుతున్నారు. ఈ ప్రాంతంలో రాజకీయ వివాదాలతో పాటు గంజాయి సాగు , జూదం, గుట్కా రవాణా కేసులు స్టేషన్‌లో చాలానే నమోదయ్యాయి. ఈ స్టేషన్‌లో ఎస్‌ఐతో పాటు ఇద్దరు ఏఎస్‌ఐలు, నలుగురు హెడ్‌కానిస్టేబుల్‌లు, 21 మంది కానిస్టేబుల్‌లు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, 8 మంది కానిస్టేబుల్‌లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. నలుగురిలో ఒక్క హెడ్ కానిస్టేబుల్ పోస్టును భర్తీ చేయకపోవడం విశేషం.

ఎస్‌ఐలే పోలీస్ వాహనం డ్రైవర్

వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన వాహనానికి కనీసం డ్రైవర్‌ను కూడా నియమించకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఎస్‌ఐలే స్వయంగా డ్రైవింగ్ చేసుకొంటూ సంఘటన స్థలాలకు వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వం పోలీసు శాఖకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తున్నప్పటికీ మారుమూల ప్రాంతాల స్టేషన్‌లకు సిబ్బందిని కేటాయించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. మండలంలో 21 గ్రామ పంచాయతీలు, రెండు మదిర గ్రామాలు, గిరిజన తండాలు ఉన్నాయి. స్టేషన్ ప్రాంతంలో క్రైం శాతం ఎక్కువగానే ఉంటుంది. హత్యలు, ఆత్మహత్యలు, పేకాట కేసులు, రాజకీయ గొడవలు బాగా జరుగుతుంటాయి. జిల్లా పోలీసు అధికారులు వట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఖాళీలుగా ఉన్న హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్‌ఐ, కానిస్టేబుల్ పోస్టులను వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ప్రణాళికాబద్ధంగా డివిజన్ అభివృద్ధి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్

పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని బండ్లగూడ నేతాజీ నగర్, సీతారామయ్య కాలనీ, గోకుల్ నగర్, తదితర కాలనీల్లో రూ.5.40 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సరోజనమ్మ గుట్ట అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల గ్రామ పరిధిలోని సరోజనమ్మ గుట్ట అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం వెలిమెల పరిధిలోని సరోజనమ్మ గుట్టను వివిధ శాఖల అధికారులతో కలసి ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. సరోజనమ్మ గుట్ట అభివృద్ధికి ప్ర ణాళిక రూపొందించినట్లు చెప్పారు. మౌలిక సదుపాయాలతో పాటు ప్రహరీ గోడ, సీసీ రోడ్లను అభి వృద్ధి చేస్తున్నట్లు వివరించారు. గుట్టపై ఉన్న ఆల యాలను మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సంగారెడ్డి, తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, నాయకులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మున్సిపల్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

జహీరాబాద్ టౌన్: పెండింగ్ వేతనాలు, మూడు నెలలకు సంబంధించిన పీఎఫ్ డబ్బులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మున్సిపల్ అధికారులను కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్మికులతో కలిసి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులు జీతాలు సకాలంలో రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బకాయి వేతనాలు, పీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పనిలో గాయపడిని సామేల్‌ను ఆదుకోవాలన్నారు. ఈ మేరకు మున్సిపల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు యశోద మానిక్, సిద్ధమ్మ తుకారాం పాల్గొన్నారు.



కంగ్టిలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ పాల్గొన్న యువకులు

ఉగ్రదాడికి నిరసనగా శాంతి ర్యాలీ

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండిస్తూ జిల్లా వ్యాప్తంగా ప్రజలు శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పిరికిపందలే ఇటువంటి దాడులకు పాల్పడతారని, ఈ ఉగ్రదాడికి తగుమూల్యం చెల్లించుకోక పలువురు యువకులు హెచ్చరించారు. ఆయా మసీదుల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఉగ్రవాద చర్యలకు దేశం ముక్తకంఠంతో ఖండిస్తుందన్నారు.



జహీరాబాద్ టౌన్‌లో..



నారాయణఖేడ్ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



రామచంద్రాపురం : కొవ్వొత్తుల ర్యాలీ

27న నిధి ఆప్కే నిఖత్ 2.0

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ఈ నెల 27న నిధి ఆప్కే నిఖత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు కేంద్రాల్లో శిబిరాలను ఉ. 9:30 నుంచి సా.5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్ కూత్బుల్లాపూర్‌లో విర్కో బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, శేరిలింగంపల్లి పరిధిలోని జయభేరి ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్, పటాన్‌చెరు మండలంలోని రుద్రారం ఎంవైకె లాటిక్రైట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో భవిష్యనిధి సమస్యలు ఉన్న వారు పరిష్కరించుకోవాలని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలం ఎస్టీ గ్రామానికి చెందిన ఆశాబీకి సీఎం సహాయ నిధి కింద రూ.39,500 చెక్కు మంజూరయింది. సంబంధించిన చెక్కును శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మాజీ ఎంపీటీసీ పురంజన్, నాయకులు రహీం, కృష్ణ, ఏక్‌నాథ్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలతో లబ్ధి

మండల విద్యాధికారి గోవింద్‌రెడ్డి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంఈఓ

వట్‌పల్లి(అందోల్): ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను 14 ఏళ్ల లోపు బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి గోవింద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మర్వెల్లి ఉన్నత పాఠశాలలో తెలంగాణ రైజింగ్ ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల మనోఉల్లాసం కోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. శిబిరాల ద్వారా తమకు నచ్చిన క్రీడాంశాలపై శిక్షణ పొంది జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ బలిజ సంఘం అధ్యక్షుడు పి. సంగమేశ్వర్, కోర్స్ డైరెక్టర్ నాగిరెడ్డి, కోర్సు కోర్డినేటర్ నర్సింలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్హేర్, సిర్గాపూర్‌లో..

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్, సిర్గాపూర్‌లో శుక్రవారం వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. ఎంఈఓలు గంజి శ్రీనివాసులు, నాగరం శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులు నైతిక విలువలు, నడవడికను నేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు శివకుమార్, ప్రకాశ్ పాల్గొన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ రైసింగ్ ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి నాగేశ్వర్‌నాయక్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిబిరంలో విద్యార్థులకు సంగీతం, చిత్రలేఖనం, వ్యక్తిత్వ వికాసం, కుట్లు, అల్లికలు, ఇండోర్ గేమ్స్, కథలు చెప్పడం, యోగా, ధ్యానం తదితర వాటిపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

శరవేగంగా నిమ్జ్ రోడ్డు పనులు

- తుది దశకు నాలుగు వరుసల రోడ్డు
- హుగ్గెల్లి చౌరస్తాలో మిగిలిన అనుసంధాన పనులు



వంద అడుగుల నిమ్జ్ రోడ్డు



హుగ్గెల్లి చౌరస్తాలో చేపడుతున్న అనుసంధాన పనులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్, ఝరాసంగం మండలాల్లో చేపడుతున్న నిమ్జ్ రోడ్డు పనులు తుది దశకు చేరుకున్నాయి. జాతీయ పెట్టుబడులు, ఉత్పాదక మండలి(నిమ్జ్) కోసం ప్రత్యేకంగా 100 అడుగుల వెడల్పుతో నాలుగు వరుసల రహదారిని వేస్తున్నారు. జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి చౌరస్తా నుంచి రంజోల్, ఝరాసంగం మండలంలోని కృష్ణాపూర్, మాచ్‌నూర్, బర్దిపూర్ వరకు రూ. 100 కోట్లతో సుమారు 9 కిలోమీటర్ల రోడ్డును నిర్మిస్తున్నారు. హుగ్గెల్లి చౌరస్తా వద్ద 65 జాతీయ రహదారితో ఈ రోడ్డును అనుసంధానం చేస్తున్నారు. రోడ్డు పనులు శరవేగంగా చేపడుతున్నారు. ఇప్పటికే దాదాపు 90 శాతం పనులు పూర్తి కాగా హుగ్గెల్లి చౌరస్తా వద్ద మిగులు పనులు కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌తో పాటు ముంబాయి నుంచి నిమ్జ్ వైపునకు వెళ్లడానికి చౌరస్తాలో విస్తీర్ణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. రోడ్డు మార్గంలో 13 చోట్ల వంతెనలను నిర్మించారు. భద్రత కోసం రహదారిపై జీబ్రా క్రాసింగ్స్, వేగ పరిమితి గుర్తులు వేశారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతుల కోసం రోడ్డుకు ఇరువైపుల వంద మీటర్ల రోడ్డు విస్తరించారు. రోడ్డు మధ్యలో డివైండర్లు, ప్రధాన కూడళ్ల వద్ద హైమాస్ట్ లైట్లను కూడా ఏర్పాటు చేశారు. దాదాపు పనులు పూర్తికావడంతో ప్రజలు ఇప్పటికే బర్దిపూర్, ఎల్గోయి గ్రామాలకు వెళ్లడానికి ఇదే రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తున్నారు. వంద శాతం పనులు పూర్తయితే నిమ్జ్ రోడ్డుపైన రద్దీ పెరిగే అవకాశం ఉంది. నిమ్జ్ ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణం పనులపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య



పిల్లలతో మాట్లాడుతున్న సౌజన్య

సంగారెడ్డి టౌన్: విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలోని బాల సదనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన కల్పించాలని, పిల్లలకు సరైన వసతులను అందించాలన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు న్యాయపరమైన విషయంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు కార్లు సిద్ధం



ప్రత్యేక ఆకర్షణలో కార్లు

రామచంద్రాపురం(పటాన్ చెరు): వరంగల్‌లో కేసీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన రజతోత్సవ సభకు తెల్లాపూర్ మున్సిపల్ చెందిన బీఆర్‌ఎస్ నాయకులు సాయి చరణ్ గౌడ్ కారులను సిద్ధం చేస్తున్నారు. పార్టీ సింబలైన అంబాసిడర్ కారులను సిద్ధం చేస్తున్నారు. ప్రత్యేక ఆకర్షణ కోసం 15 కార్లను సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పలుగుతండాలో వినూత్న ప్రచారం

నారాయణఖేడ్: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలంటూ మండలంలోని పలుగు తండాలో శుక్రవారం ఖేడ్ మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఫొటోలతో ముద్రించిన ఫ్లెక్సీలతో పాటు బీఆర్‌ఎస్ హయాంలో అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన ఫ్లెక్సీలను ముద్రించి ప్రదర్శించారు. సభకు పెద్దసంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని కోరారు.



ఫ్లెక్సీలు ప్రదర్శిస్తున్న తండావాసులు

సంక్షిప్త వార్తలు

◆ కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు

మునిపల్లి(అందోల్): రైతులు పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకొని ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసమే జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని పెద్ద చల్మెడ వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ దుర్గయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని రైతు వేదికలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వ్యవసాయాధికారి అనిత, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

◆ ముగిసిన ముర్షత్‌దర్గా ఉత్సవాలు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలో ముర్షత్ దర్గా ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. బుధవారం నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభం కాగా గంధం ఊరేగింపు, గురువారం దర్గా ఆవరణలో కవ్వాలి, అన్నదానం నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఉత్సవాలు ముగిశాయి, శుక్రవారం దర్గా కమిటీ నిర్వాహకులు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి చద్దర్‌దట్టి వేశారు. ఉత్సవాలకు పట్టణ మండల ఇతర ప్రాంతాల నుంచి ముస్లింలు, హిందువులు తరలి వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

◆ విద్యుత్ పోల్‌ను ఢీకొట్టిన డీసీఎం

జిన్నారం (పటాన్‌చెరు): వేగంగా దూసుకువచ్చిన డీసీఎం వాహనం విద్యుత్ హైటెన్షన్ పోల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలోని దోమడుగు జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు పోలీసుల కథనం ప్రకారం.. జిన్నారం మండలం, బొల్లారం మున్సిపాలిటీ నుంచి బొంతపల్లి పారిశ్రామికవాడకు వస్తున్న ఓ డీసీఎం మితిమీరిన వేగంతో దోమ దుగు మూలమలుపు సమీపంలోని బస్టాప్ వద్ద విద్యుత్ హైటెన్షన్ పోల్‌ను ఢీకొట్టింది. దీంతో విద్యుత్ పోల్ రోడ్డుకు అడ్డంగా పడింది. తృటిలో పెను ప్ర మాదం తప్పింది. వెంటనే స్థానికుల సమాచారం మేరకు అప్రమత్తమైన విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ ఘటనలో డీసీఎం క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

◆ పోలీసుల అదుపులో అనుమానితులు

జిన్నారం (పటాన్‌చెరు): ఇటీవల జిన్నారం మండల కేంద్రంలోని తాంబేలుగుట్టపై విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనలో అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. 30 మందిని అరెస్టు చేశారని సమాచారం. మరికొందరిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. జిన్నారంలో 163 సెక్షన్ అమలు జరుగుతోంది. చెక్ పోస్టుల వద్ద పోలీసులు తనిఖీలు యథావిధిగా కొనసాగిస్తున్నారు.

◆ రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం

జిన్నారం (పటాన్‌చెరు): 27 వరంగల్ లో నిర్వహించనున్న రజతోత్సవ సభను గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ యువత నాయకులు వెంకటేశం గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిన్నారం మండలం నల్తూరులో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామరక్ష కేసీఆర్ ఒక్కడేనని స్పష్టం చేశారు.

◆ క్రీడాపోటీలకు విద్యార్థినులు ఎంపిక

మునిపల్లి(అందోల్): ఆల్ ఇండియా అంతర్ కళాశాల క్రీడాపోటీలకు బుదేరా సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి శుక్రవారం తెలిపారురు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీబీఏ గ్రూపు మొదటి సంవత్సరం చదువుతున్న రెబెకా, జనరల్ గ్రూపు రెండవ సంవత్సరం చదువుతున్న రాధిక, సీపీ గ్రూపు మూడవ సంవత్సరం చదువుతున్న మీనాక్షిలు ఎంపికయినట్లు చెప్పారు. మే 4 నుంచి 8వ వరకు నెల్లూరులోని విక్రమ సింహపురి, యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ స్టాఫ్ బాల్ టోర్నమెంట్ పోటీల్లో పాల్గొననున్నట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి తెలిపారు.

◆ సీసీ రోడ్డుకు శంకుస్థాపన

జహీరాబాద్ టౌన్: మండలంలోని రాయిపల్లి(డి) గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే మాణిక్‌రావు సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. సీసీ రోడ్డును త్వరగా నిర్మించాలని, నాణ్యత ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, నాయకులు గుండప్ప, మశ్చందర్, విజయ్, రాములు పాల్గొన్నారు.